# గణపతి గాత్రకచేరి

మంత్రవాది మహేశ్వర

మహాగణపతింభజే మంటసాలగారు గానం చేసిన పాట వినిపిస్తోంది రేడియోలోంచి

ఆ గానంలో లీనమై పరిసరాలను మరచిపోయి డాన్స్ మొదలెట్టేశాడు విఘ్నేశ్వరుడు

ఎ పని చేస్తున్నా ఆ పాటే గుర్తొస్తోంది అంత మదురంగా పాడారు కనుకనే అంత మంది అబిమానాన్ని పొందగలిగేరు ఆ క్షణం నుంచీ తనకీ రేడియోలో కచేరీ చేయాలనే కోరిక కలిగింది

దానికి ఏం చేయాలి?? ఆలోచించి అంతుబట్టలేక కుమారస్వామిని సలహా అడిగాడు

ఎమిటి నీకు ఉన్నట్టుండి ఈ బుద్ధి పుట్టింది కీర్తి ప్రతిష్ఠల మీద వ్యామోహమా

అలాకాదు అసలు నేను పాడితే ఎలా వుంటుందో అని

వివరాలు నాకంటే నారదుల వారికే బాగా తెలుస్తాయి ఆయన ఇప్పుడు ఊళ్ళోలేరు కాబట్టి నువ్వే ఆకాశవాణి కేంద్రానికి ఉత్తరం వ్రాసి కనుక్కో తెలుస్తుంది

ఏం వ్రాయాలి–

ఎలా వ్రాయాలి– అని పదేపదే ఆలోచించుకుని కాగితం కలం తీశాడు

ఆకాశవాణి స్టేషను డైరెక్టరు గారికి అడ్రస్ చేస్తూ గాత్ర కచేరీలపై తనకుండే ఆసక్తిని తన అనుబవాన్ని ఎంత మందిని తన గానంతో మంత్ర ముగ్ధుల్ని చేసినదీ వివరిస్తూ పెద్దలిచ్చిన అభినందన పత్రాలను జతచేస్తూ అవకాశ మివ్వమని కోరుతూ లెటర్ వ్రాశాడు

నెల–

రెండ్నెల్లు– జవాబులేదు

అదే పనిగా ఎదురు చూస్తున్నాడేమో మరీ విసుగనిపించింది

కోరిక మరీ ఎక్కువైపోయింది

కేసెట్ రికార్డర్‌లో పాడి చూసుకున్నాడు చాలా మదురంగా అనిపించింది

మొదటి లెటర్‌కి జవాబు రెండ్నెల్లు దాటి పోయినా రాలేదని కాస్త ఘాటుగా వ్రాశాడు స్టేషను డైరెక్టరుగారికి

పలితం లేకపోయింది

కొన్ని కొన్ని విషయాలు ఉత్తరాల ద్వారా పరిష్కారం కావని పర్సనల్‌గా వెడితేనే సాధ్య పడుతుందని మూషికం అబిప్రాయపడింది

చవితికి ఎలాగైనా ట్రిప్ వేద్దామనుకున్నాడు కాబట్టి కాస్త ముందుగానే బయలుదేరి తెలుగుదేశం చేరుకున్నాడు

ఆకాశవాణి – పెద్ద బోర్డు

దాని మీద ఇంగ్లీషులోను హిందీలోను పెద్ద పెద్ద అక్షరాలు చిన్న అక్షరాలు తెలుగులో

గేటు దగ్గర కాకీ దుస్తులతో చేతిలో తుపాకీతో ఓ ఆరడుగుల వ్యక్తి బొమ్మలా నిలబడ్డాడు

ఎక్స్‌క్యూజ్‌మీ అన్నాడు గణపతిగా వెళ్ళిన విఘ్నేశ్వరుడు

తలకాయ కాస్త కదిలించి క్యా హోనా అన్నాడు

అందర్ జానా బడేసాబ్‌సే మిల్నే కాహై

పాస్ బతావ్

'నహీతో కాంట్రాక్ట్ నికాలో

వాడేమన్నాడో అర్థం కాలేదు గణపతికి

ప్రొటెక్టెడ్ ప్లేస్– బయపెడుతున్నట్లు మరో బోర్డు

వాడి చొక్కా జేబుకి తగిలించి వున్న ప్లాస్టిక్ బిళ్ళపైన'యాదగిరి పేరు చూశాడు

హమ్మయ్య తెలుగువాడే అనుకుని "నేను స్టేషను డైరెక్టర్ గారిని కలవాలి నా పేరు గణపతి చాలా దూరం నుంచి వచ్చాను"

ఏమనుకున్నాడో ఏమో సెక్యూరిటీ గార్డ్ డ్యూటీ రూమ్‌కి ఫోన్ చేశాడు గణపతి అనే వ్యక్తి వచ్చారన్నాడు

లోపలికి పంపించమని జవాబొచ్చింది

డ్యూటీ ఆఫీసర్‌ను కలిశాడు–

కచేరీ ఇవ్వాలని వుంది ఎం చేయాలి అని డైరెక్టరు గారిని కలిస్తే అవకాశం వుంటుందా అని సందేహాలు వెలిబుచ్చాడు

ఆడిషన్ టెస్ట్‌లో పాసైన వాళ్ళకే ఆ చాన్స్ వుంటుందని వివరాలు అవీ తెలుసుకోవాలంటే మ్యూజిక్– ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌ని కలిస్తే తెలుస్తుందని ఓపిగ్గా చెప్పాడు మరేం పనిలేక

ఆయన ఎ మూల కూర్చుని వుంటాడో తెలుసుకుని సెక్షనుకు వెళ్ళాడు

ఆయన సీట్లో లేడు– వినాయక చవితి సందర్భంగా ప్రసారం కా బోయే ప్రత్యేక సంగీత రూపకం గురించి డిస్కస్ చేయడానికి డైరెక్టరుగారి రూమ్‌లో వున్నారని తెలిసింది

గంటసేపు అక్కడ వెయిట్ చేశాక ఆయన వచ్చాడు

ఎం కావాలండీ

నమస్కారమండీ నాకు రేడియోలో కచేరి యివ్వాలని వుంది

ఆడిషన్ టెస్ట్ కండక్ట్ చేస్తుంటాం దాంట్లో పాసవ్వాలి వోకల్ అయినా ఇన్స్ట్రుమెంటల్ అయినా సరే దానికి అప్లికేషన్ కావాలంటే ప్రోగ్రామ్ సెక్రటరీ మణిగారిని కలవండి"

ప్రోగ్రాం యివ్వాలంటే మరో మార్గం లేదంటారా

మ్యూజిక్ ప్రోగ్రాం యివ్వాలంటే అదే ప్రొసీజర్

లలిత సంగీతం అయినట్లయితే–

అదీ అంతే ఒక వేళ ఏదైనా రిజిష్టర్డ్ అసోసియేషన్ ద్వారా అయితే! యువవాణి లో పాడొచ్చు అయితే కదంబ కార్యక్రమం

అయివుండాలి''

అంటే

ఓ నాటకం ఓ కథానిక ఓ రెండు పాటలు కవితలు అలా ఏవైనా ఓ రెండు మూడు అయిటమ్స్ కలిపివ్వాలి దానికి నూటయాభై రూపాయలు ఫీజౌంటుంది

మేం కట్టాలా'

కా దు మేమే యిస్తాం

–ఇంకా ఏదో చెప్ప బో తుండగా ప్యూన్ వచ్చి సార్ డ్యూటీ రూమ్‌లో మీకు ఫోన్ కాల్ బాలమురళిగారు లైన్లో వున్నారు''

అలాగే వస్తున్నాను ఎక్స్‌క్యూజ్‌మీ అని చెప్పేసి వెళ్ళిపోయాడు

ఈ లోపుగా ఆడిషన్ టెస్ట్‌కి అప్లికేషన్ తీసుకోవాలని ప్రోగ్రామ్ సెక్రటరీ దగ్గరికి వెళ్ళాడు

బుర్ర ఎత్తనైనా ఎత్తకుండా టైప్ చేసుకుపోతోంది ఆమె

ఎంతో సేపటికి ఏం కావాలి అన్నట్టు చూసింది

ఆడిషన్ అప్లికేషన్

బీరువా తెరిచి ఒక ఫారం యిచ్చింది

ఎంత

ఫ్రీయే'

ప్రొసీజర్ చెప్తారా''

ఏముందండీ మీరు ఏ జోన్‌కి చెందుతారో ఆ దగ్గర్లోని ఆకాశవాణి కేంద్రానికి అప్లై చేయాల్సి వుంటుంది మిగిలిన వివరాలు అందులోనే వున్నాయి ఆడిషన్‌లో పాసైతే రెగ్యులర్‌గా కాంట్రాక్ట్‌ని మేం పంపుతాం'

చెప్పేసి తన టైపింగ్ వర్క్‌లో పడిపోయింది

ఇంతలో ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ తన సీట్లో కూలబడి వున్నాడు

కనిపించగానే అప్లికేషన్ తీసుకున్నారా నవ్వుతూ అడిగాడు

చాలా ప్రొసీజర్ వుందండి' ఏమో అనుకున్నాను అన్నాడు గణపతి

రేడియోలో తన కచేరీ రావాలంటే చాలా కష్టమే అనుకున్నాడు

కనీసం మాట్లాడాలంటే– – అదే అడిగాడు

స్పోకెన్ వర్డ్ ప్రొడ్యూసర్‌ని కలవమన్నాడు ఆయన దగ్గరికి వెళ్ళాడు వెంటనే గణపతి

కుటుంబ సంక్షేమం– బడి పిల్లల పాత్ర అన్న అంశంపైన సీరియస్‌గా కళ్ళ జోడాయనతో డిస్కస్ చేసేస్తున్నాడు

అరగంట తరువాత ఆయన వెళ్ళి పోవడం గణపతిని కూర్చోమని ప్రొడ్యూసర్‌గారు టిపిన్‌కెళ్ళి గంట తరువాత రావడం జరిగింది

ఏం కావాలి చెప్పండి

నా పేరు గణపతి అఫ్‌కోర్స్ నాకు సంగీతంలో మంచి ప్రవేశం వుందనుకోండి అయితే టాక్ ఇవ్వాలంటే ఏం చేయాలి అని

ఏ రోజు ఏ ప్రోగ్రామ్ అన్నది చాలా ముందే షెడ్యూల్ అయిపోతుంది సబ్జక్ట్ మేమే ఇస్తుంటాం ఒకోసారి టాకర్స్ నుంచి తీసుకుని కూడా షెడ్యూల్స్ ప్రిపేర్ చేస్తుంటాం ఇంతకు ముందు మీరేమైనా ప్రోగ్రామ్స్ యిచ్చారా–

లేదండి

• చిన్నవారిలా కనిపిస్తున్నారు ఓ పని చేయండి సత్యానందంగారు యువవాణి సెక్షన్ చూస్తున్నారు అన్నట్టు ఆయన లీవ్‌లో వున్నట్టున్నారు వారం తరువాత కలవండి

గణపతికి విసుగొచ్చింది అయినా సంగీతం మీద ఆసక్తి చావలేదు ఎలాగైనా తన ప్రతిభ చూపించి బి గ్రేడ్ నుంచి బి– హై ఆ తరువాత ఏ గ్రేడ్ ఆర్టిస్ట్ అయిపోవాలి తన గానాన్ని మెచ్చుకోని వాళ్ళెవరు?

కైలాసంలో ఎంత మందిని ముగ్ధుల్ని చేయలేదు? ఆలోచనల్లో పడిపోయాడు

★ ★ ★ ★ ★

సంవత్సరం తరువాత ఆడిషన్ టెస్ట్‌కి రమ్మని పిలుపొచ్చింది

ఆ తరువాత సంవత్సరానికి రిజల్ట్స్ వచ్చింది– రిగ్రెట్ లెటర్ చూచి నీరుకారిపోయాడు గణపతి

చాలా డల్ అయిపోయాడు

తన పర్ఫామెన్స్‌కి సెలక్టయి పోతాడనుకున్నాడు

★ ★ ★ ★ ★ ★

రేడియో కర్నాటక సంగీత కార్యక్రమంలో పిచ్చేశ్వరరావు గానం వస్తోంది

మహాఘోరంగా పాడేస్తున్నాడు

శృతి లయ ఏమీలేదు

ఎక్కడా మాదుర్యంలేదు

తను సెలక్ట్ కాకపోవడానికి పిచ్చేశ్వరరావులాంటి వాళ్ళు సెలక్ట్ అయిపోవడానికి కారణం చాలా సేపటిదాకా బుర్రకి తట్టలేదు



తన కోరిక తీరాలంటే బయట కచేరీలిచ్చి నలుగురితోటి శబాష్ అనిపించుకుంటే సరి– అని సర్దుకున్నాడు ఏమీ చేయలేక

చికాగ్గా వున్న మనసుకు ఊరట కలిగించడానికి టేప్ రికార్డర్‌ను ఆన్ చేశాడు

రానిదిరాదు సురాసురులకైన

పోనిది పోదు భూసురులకైన మణిరంగు రాగంలోని ఆ త్యాగరాజు కీర్తన బాలమురళి గళం నుంచి కమ్మగా సాగిపోతోంది

–వింటూ తన్మయత్వంలో పడిపోయాడు గణపతికాదు విఘ్నేశ్వరుడు □